క్లుప్తంగా

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

దహెగాం: మండలంలోని కుంచవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మోడల్ లైబ్రరీని ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయం వల్ల విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటుతో పాటు, ఆలోచన , ఊహాశక్తి, సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయంలో 800 రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రూంటు రీడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ పల్లె వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈవోగా సుభాష్



బాధ్యతను స్వీకరిస్తున్న సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: మండల విద్యాధికారిగా గురువారం రాథోడ్ సుభాష్ ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. కాగా వీరికి విద్యాశాఖ అదనంగా మండల విద్యాధికారిగా ఉత్తర్వులు జారీ చేశారు. విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీలో ఖాళీగా వంట సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 9వరకు కేజీ బీ వీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలని కోరారు.

108లో ప్రసవం

రెబ్బెన(ఆసిఫాబాద్): తిర్యాణి మండలంలోని చోపిడి గ్రామానికి చెందిన ఆత్రం భీం బాయి అనే గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాల్లోకి వెళితే.. గురువారం ప్రసవం భీం బాయికి పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెను బెల్లంపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అప్రమత్తమైన 108 ఈఎంటీ పరుశురాం, పైలెట్ సంతోష్‌లు వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేసి పురుడుపోయగా పండంటి ఆడ శిశువు జన్మించింది. అనంతరం తల్లిబిడ్డలను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హెచ్ఎంను సస్పెండ్ చేయాలి

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అనారోగ్యానికి కారణమైన హెచ్ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యెలగతి సుచిత్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన విద్యార్థినులు 64 మందికిపైగా అస్వస్థతకు గురి కావడం బాధకరమన్నారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు ఇప్పటి వరకు తెలియకపోవడం ఏంటని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేదంటే సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో బెల్ట్ క్లీనింగ్, సేల్‌ప్లిక్కింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికుల సంఘం గోలేటి బ్రాంచి కార్యదర్శి చల్లూరి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీ, ఓసీపీల్లో బెల్ట్‌పై పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పనికి తగిన వేతనాలు అందడం లేదన్నారు. కార్మికులకు అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లించడం సరికాదన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాగర్‌గౌడ్, భీమేశ్, ఆశన్న, శంకర్, సురేశ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వంట.. తప్పని తంట

- మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఇబ్బందులు
- కట్టెల పొయ్యిపైనే వంటలు
- గ్యాస్‌స్టవ్ అందించాలని వేడుకోలు



గోయగాంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



నిషాని పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. కట్టెల పొయ్యిపై వంటలు వండుతున్నారు. దీంతో నిర్వాహకులకు తిప్పలు తప్పడం లేదు. ఓ వైపు వంట గదులు, మరో వైపు గ్యాస్ పొయ్యిలు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో మొత్తం 85 పాఠశాలలుండగా.. జిల్లా పరిషత్ పాఠశాలలు మూడు, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు 7, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు 73 ఉన్నాయి. ఇందులో 5022 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతీ పాఠశాలకు రోజు పది కిలోల కర్ర అవసరం అవుతుంది. దీంతో ఏళ్ల తరబడి భారీ వృక్షాలు నేల కొరుగుతున్నాయి.

పొగతో ఆరోగ్యానికి హానికరం

కట్టెల పొయ్యి నుంచి వచ్చిన పొగ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. పొగ గాలిలో కలవడం ద్వారా వాతావరణం కలుషిత మవుతుంది. వంట తయారు చేసే వారికి పొగ ద్వారా కళ్లు, ఊపిరితిత్తులు, గొంతు, ముక్కుకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొన్ని పాఠశాలలకు వంట గదులు నిర్మించినా.. ఇప్పటి వరకు ఎండీఎం ఏజెన్సీలకు గ్యాస్ సిలండర్లు, పొయ్యిలు, వంట పాత్రలు పంపిణీ చేయలేదు. 20 పాఠశాలలకు గ్యాస్ స్టవ్‌లు ఉన్నప్పటికీ, కొన్నింటికి సిలిండర్లు లేక నిరుపయోగంగా మారాయి.

ఇబ్బంది పడుతున్నాం



మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ పొయ్యి లేక ఇబ్బంది పడుతున్నాం. వంట పాత్రలు కూడా అందించలేదు. దీంతో ఇంటి నుంచి తీసుకొని వంటలు చేస్తున్నారు. ఆరు బయట వంట ప్రమాదమే, కట్టెలు కూడా లభించడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. – మడావి భీంబాయి, భీమన్‌గొంది

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గ్యాస్ పొయ్యి లేకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్తాం. గ్యాస్ పొయ్యిలను ప్రభుత్వం ప్రత్యేక నిధులు వెచ్చించి కొనుగోలు చేయాలి.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

విద్యార్థులకు చెకుముకి పరీక్ష



చేద్వాయిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేద్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల టాలెంట్ పరీక్షను గురువారం నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను ఎంఈవో రమేశ్‌బాబు, చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా అధ్యక్షుడు రాజ్ కమలాకర్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సైన్స్‌తో శాస్త్రీయ జ్ఞానం పెంపొందుతుందన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించటానికి సైన్స్ టాలెంట్ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు రాకేశ్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, తాజ్‌పాషా, శిల్ప, సుమిత, అబ్దుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్‌పై సింగరేణి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు, అధికారులకు గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో విజిలెన్స్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. సమగ్రత సంస్కృతి– దేశ పురోభివృద్ధి అంశంపై శిక్షకులు కిషోర్ బగాదియా అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి ప్రభావం వ్యక్తులపై, సమాజంపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. అవినీతిని అడ్డుకుంటే అన్ని రంగాలు పురోగతి సాధిస్తాయని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: యూ– డైస్ ప్లస్ పోర్టల్ విద్యార్థుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి అబిద్ అలీ అన్నారు. గురువారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూ– డైస్ వివరాల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి వివరాలను పోర్టల్ తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతుల కల్పన, ఉపాధ్యాయుల వివరాలను సైతం నమోదు చేయాలన్నారు. పోర్టల్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏమైనా పొరపాట్లు జరిగితే ఎలా సవరణలు చేయాలనే అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంఈవో గావుడే హన్మంతు, హెచ్ఎం నారాయణ్‌సింగ్, తదితరులున్నారు.

మన్నెవార్ కులస్తులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: మన్నెవార్ కొలవార్ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని మన్నెవార్, కొలవార్ సేవ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మెర్పల్లి సదాశివ్ అన్నారు. గురువారం మండలంలోని గురుడుపేట గ్రామంలో మన్నెవార్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనలో మన్నెవార్ కులస్తులు మన్నెవార్ కులంగా రాయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న కులగణనకు అందరూ సహకరించాలన్నారు. మన్నెవార్ల కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మెర్పల్లి బ్రహ్మయ్య, రవి, భీమయ్య, నారాయణ, రఘు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

తిర్యాణి: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక ప్రవీణ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 10, 11 తేదీలలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయడంతో పాటు బేషరతుగా పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జనార్దన్, మండల అధ్యక్షుడు భరత్ చంద్ర, దేవుషా, రామారావు, పర్వత్‌రావు, నైతం లచ్చు, సందీప్, రవి, నగేశ్ పాల్గొన్నారు.

బేకరీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలు

కౌటాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ బేకరీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తితే.. మండల కేంద్రానికి చెందిన బండి ప్రభాకర్‌గౌడ్ అనే వినియోగదారుడు బుధవారం సాయంత్రం స్థానిక బేకరీలో క్రీమ్‌బన్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. అతని భార్య బండి శైలజాగౌడ్ క్రీమ్‌బన్ తినడంతో రాత్రి వాంతులు, విరోచనాలు చేసుకున్నారు. దీంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. గురువారం ఉదయం వినియోగించిన క్రీమ్‌బన్ ప్యాకింగ్ కవర్‌ను పరిశీలించి చూడగా కాలపరిమితి ఈనెల 5వరకే ఉంది. దీంతో వినియోగదారుడు బేకరీ వద్దకు చేరుకొని దుకాణాదారులను నిలదీశారు. సదరు దుకాణాదారుడు దురుసుగా సమాధానం ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వినియోగదారుడు ప్రభాకర్‌గౌడ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బేకరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుతో సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకునే వీలుందన్నారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా లేదా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ సాయికృష్ణ, ఏపీవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్

కెరమెరి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వాహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకం టీఏ, ఎఫ్ఏలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఏవైనా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. అయితే వాటి వివరాలు సమర్పించాలన్నారు. ఎంతమందికి ఇంకా ఉపాధి కూలీలకు వేతనాలు రావాల్సి ఉంది. వాటిని క్లియర్ చేయాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ బిక్యా నాయక్, పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తిచేయాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: కుటుంబ సర్వే ప్రక్రియ గడువులోగా పూర్తిచేయాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. గురువారం పట్టణంలోని ఓల్డ్‌కాలనీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో కుటుంబ సభ్యుల వివరాలు పొరపాట్లకు తావులేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేకాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇళ్లను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి



స్టిక్కర్లు అంటిస్తున్న అధికారులు

కౌటాల: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కౌటాల తహసీల్దార్ పుష్పాలత అన్నారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా రెండో రోజు గురువారం కౌటాలలో ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే చేస్తామని, సర్వే సమయంలో ప్రజలు అందుబాటులో ఉండాలన్నారు. సర్వేకు అన్ని ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎంఈవో హన్మంతు, ఎంపీవో మహేందర్‌రెడ్డి, డీటీ మస్కూర్ అలీ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: సమగ్ర సర్వేలో భాగంగా గురువారం రెండో రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి సర్వే కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఉన్న ఇళ్ల సంఖ్యను లెక్కించి ఇంటి యజమాని పేరును స్టిక్కర్ పై రాసి గోడలకు, తలుపులకు అతికించారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉండగా, 119 మంది ఎన్యూమరేటర్లను, 10 మంది సూపర్‌వైజర్లు విధుల్లో ఉన్నారు. వీరి పనితీరును ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ పరిశీలించారు.

సైన్స్‌పై అవగాహన కల్పిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు



మాట్లాడుతున్న అధికారి జాడి దేవాజీ

కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఫైనాన్స్ అకౌంట్స్ అధికారి జాడి దేవాజీ అన్నారు. భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వారి సౌజన్యంతో గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మొబైల్ సెంటర్‌లో కాగజ్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు సక్రమంగా బోధించాలన్నారు. అనంతరం జిల్లా సైన్ అధికారి కటుకం మధూకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే సైన్స్‌పై అభిరుచి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మామిడాల తిరుపతయ్య, దెబ్బటి లక్ష్మిప్రసన్న ఉపాధ్యాయులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు.

తల్లి పేరిట మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న యూత్ సభ్యులు

కెరమెరి: ప్రతిఒక్కరూ తల్లి పేరిట మొక్కలు నాటాలని నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మజీద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పీఎం నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మాకే నామ్' అనే కార్యక్రమాన్ని గురువారం చౌపన్‌గూడ గ్రామంలోని శ్రీ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని హట్టి, జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామన్నారు. సంఘం సభ్యులు కాత్లే జగన్, పంద్రం వసంత్‌రావు, మడావి తుకారం, కుర్సెంగ క్రిష్ణ, ఆత్రం సాగర్, ఆత్రం మోతిరాం, చాహకటి నాగోరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జంగు కోచ్ అరవింద్‌తో కలిసి గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ అండర్–14 హ్యాండ్‌బాల్ జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారని తెలిపారు. ఈనెల 8న హుస్నాబాద్‌లో జరిగే పోటీలకు అమూల్య, ముత్తుబాయి, అనిత, మౌనిక, ఇంద్రజ, అలేఖ్య, లక్ష్మి, పల్లవి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఖోఖో పోటీలకు..

రెబ్బెన: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. గతనెల 29న జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ డి. నవ్య, డి. అంజలిలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్ దీప్తి, పీఈటీలు స్వరూప, రజితలు అభినందించారు.

చెస్ పోటీలకు..

మందమర్రిలోని లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్–17 చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాశాలకు చెందిన విద్యార్థిని ముంజం సుప్రియ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.